ప్రజా విశ్వంభర
V3 NEWS లక్ష్యం సమాజహితం

# ఆకట్టుకుంటున్న 'ఏమో ఏమో ఇది' గ్లింప్స్



దర్శకుడు డా. శైలేష్ కొలను, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నాగవంశీ సరికొత్త రొమాంటిక్ కామెడీ సినిమా కోసం చేతులు కలిపారు. రోషన్ మేకా, ప్రీతి ముకుందన్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి 'ఏమో ఏమో ఇది' అనే అందమైన టైటిల్ ను ఖరారు చేశారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా టైటిల్ తో పాటు గ్లింప్స్ ను ఆవిష్కరించారు. "ఏమో ఏమో ఇది" అనే టైటిల్ వినగానే ఉల్లాసమైన ప్రేమ భావనలు మనసులో మెదులుతున్నాయి. చిత్ర ప్రకటన సందర్భంగా విడుదల చేసిన గ్లింప్స్ తల్లి-కొడుకుల మధ్య సరదా సంభాషణతో ప్రారంభమవుతుంది. నవతరం ప్రేమ బంధాలు, ఆధునిక వివాహాలు వంటి అంశాలను వినోదాత్మకంగా చూపించారు. గ్లింప్స్‌లో కథానాయిక తన ప్లేలిస్ట్‌లోని అలనాటి క్లాసిక్ పాటను ఆస్వాదిస్తూ కనిపిస్తుంది. ఆ సన్నివేశం ద్వారా ఆమె లోతైన భావోద్వేగ అనుబంధాన్ని, ప్రేమను ఎంతో అందంగా ఆవిష్కరించారు. బ్లాక్‌బస్టర్ 'హిట్' యూనివర్స్‌తో గుర్తింపు పొందిన దర్శకుడు శైలేష్ కొలను, "ఏమో ఏమో ఇది" ద్వారా పూర్తిగా కొత్త జానర్‌లో అడుగుపెడుతున్నారు. ఇదే ఆయన తొలి రొమాంటిక్ కామెడీ చిత్రం. ఇంతకుముందు తీవ్రత, యాక్షన్‌తో కూడిన ఉత్కంఠభరిత ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్లను అందించిన ఆయన, ఇప్పుడు హృద్యమైన, హాయిగా సాగే, సరదాగా నవ్వించే సరికొత్త ప్రేమ కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అభయ్ పాత్రలో రోషన్ మేకా నటిస్తున్నారు. తొలి చిత్రం 'పెళ్లి సందడి' ద్వారా ఆకట్టుకున్న ఆయన, ఇటీవల 'ఛాంపియన్' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నారు. అపూర్వ పాత్రలో ప్రీతి ముకుందన్ కనిపించనున్నారు. ఈ చిత్రానికి హేషామ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండటం అదనపు ఆకర్షణ. ఛాయాగ్రాహకుడు వంశీ పచ్చిపులుసు అందించిన అందమైన, హాయిగా కనిపించే విజువల్స్.. ఆహ్లాదకరమైన ప్రేమ వాతావరణాన్ని మరింత అందంగా తీర్చిదిద్దాయి. 2026 ఆరంభంలో "అనగనగా ఒక రాజు"తో ఘన విజయాన్ని అందుకున్న నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్యలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఈ సినిమా రూపొందుతోంది. 2026 దసరా కానుకగా చిత్రం విడుదల అవుతుంది. "ఏమో ఏమో ఇది" చిత్రీకరణ త్వరలో ప్రారంభం కానుంది. ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని ఆసక్తికర విషయాలు త్వరలో వెల్లడి కానున్నాయి.



# పెళ్లి చేసుకోవాలనుకుంటున్నా..

## మృణాల్ ఠాకూర్

టాలీవుడ్ సెన్సేషన్, అందాల మృణాల్ ఠాకూర్ పెళ్లి గురించి గత కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో రకరకాల వార్తలు షికారు చేస్తున్నాయి. ఈ పుకార్లకు చెక్ పెడుతూ, మృణాల్ తన వివాహం, జీవిత భాగస్వామి గురించి చాలా క్లారిటీగా స్పందించినప్పటికీ వార్తలకు చెక్ పడటం లేదు. ఈక్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ పెళ్లి చేసుకుంటానని చెప్పడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. పెళ్లి ఎప్పుడు? అనే ప్రశ్నకు మృణాల్ సమాధానమిస్తూ.. "పెళ్లి అనేది నా జీవితంలో ఒక అందమైన మలుపు. దాన్ని నేను ఖచ్చితంగా చేసుకుంటాను. కానీ, దానికి రెండు ప్రధానమైన కండిషన్స్ ఉన్నాయి. ఒకటి సరైన సమయం, రెండు సరైన వ్యక్తి. కేవలం వయసు పెరిగిపోతుందనో లేదా ఎవరో అడుగుతున్నారనో నేను తొందరపడి నిర్ణయం తీసుకోను. నా మనసుకు నచ్చిన వ్యక్తి దొరికిన క్షణమే ఆ విషయాన్ని ప్రపంచానికి నేనే స్వయంగా ప్రకటిస్తాను" అని చెప్పుకొచ్చింది. ఈ తరం వివాహ బంధాల గురించి మృణాల్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. "పాత రోజుల్లో పెళ్లి అంటే కుటుంబాల ఒత్తిడి, సామాజిక బాధ్యతగా ఉండేది. కానీ ఇప్పుడు మనం మన సంతోషానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒక వ్యక్తితో జీవితాంతం కలిసి ఉండాలంటే మనసులు కలవాలని చూస్తున్నారు. బలవంతపు బంధాల కంటే, ఇష్టపూర్వకమైన తోడు కోసం వేచి చూడటమే మేలని అనుకుంటున్నారు. వాళ్లకి నచ్చినప్పుడు నచ్చి వ్యక్తినే పెళ్లి చేసుకోవాలనుకుంటు న్నారు" అని ఆమె అభిప్రాయపడింది. ఇక మృణాల్ సినిమాల విషయానికొస్తే.. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో వరుస సినిమాల్లో చాన్స్ దక్కించుకుం టుంది. త్వరలో ఈ అమ్మడు 'దో దినావే సెహర్ మే' అనే హిందీ చిత్రంతో ప్రేక్షకులను అలరించబోతుంది. అలాగే 'డెకాయిట్' కూడా విడుదలకు సిద్ధమైంది. మృణాల్, అడివి శేష్ జంటగా నటించిన ఈ సినిమా మార్చి 19న ఉగాది కానుకగా రాబోతుంది. వీటితో పాటు మరికొన్ని చిత్రాల్లో మృణాల్ నటిస్తోంది.

# దేవి పేరు పెట్టడం నా మనసును కదిలించింది..





మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, ఉపాసన దంపతుల ఇంట ఇప్పుడు పండగ వాతావరణం నెలకొంది. ఇప్పటికే వీరికి 'క్లిన్ కారా' అనే కుమార్తె ఉండగా, ఇప్పుడు మరో ఇద్దరు పిల్లలు తోడయ్యారు. దీంతో మెగాస్టార్ చిరంజీవికి ఉన్నట్లే, చరణ్‌కు కూడా ముగ్గురు సంతానం (ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి) తో చిరంజీవి వారసత్వాన్ని కొనసాగించడం విశేషం. ఫిబ్రవరి 11న ఈ చిన్నారులకు బారసాల వేడుకను ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొణిదెల మరియు కామినేని కుటుంబ సభ్యులతో పాటు అత్యంత సన్నిహితులు మాత్రమే పాల్గొన్నారు. ఈ వేడుకలో బాబుకి 'శివరామ్ కొణిదెల' అని, పాపకి 'అన్వీరా దేవి' అని పేర్లు పెట్టారు. ఈ కాలంలో అందరూ వింత పేర్ల కోసం వెతుకుతుంటే, చరణ్ దంపతులు మాత్రం మన సంప్రదాయానికి, భక్తికి విలువనిస్తూ ఈ పేర్లను ఎంచుకోవడం విశేషం.మనవడు, మనవరాలి పేర్లు అందరికీ నచ్చడంతో మెగాస్టార్ చిరంజీవి తన సంతోషాన్ని పంచుకున్నారు. తాజాగా, ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ.. ''మా మనవడు, మనవరాలి పేర్లు చాలా బాగున్నాయని నా స్నేహితులు, బంధువుల నుండి చాలా ఫోన్లు, మెసేజ్లు వస్తున్నాయి. మన సంస్కృతిని, దైవ చింతనను ప్రతిబింబించేలా ఈ పేర్లను ఎంపిక చేసిన చరణ్, ఉపాసనలను చూస్తుంటే గర్వంగా ఉంది'' అని రాసుకొచ్చారు. ముఖ్యంగా పాప పేరులో చరణ్ నానమ్మ అంజనా దేవి పేరులోని 'దేవి' అనే పదాన్ని చేర్చడం నన్ను బాగా కదిలించింది. తన నానమ్మపై ఉన్న గౌరవంతో పాప పేరులో 'దేవి' అని వచ్చేలా చూడటం చాలా గొప్ప విషయం. ఈ పేర్లు పిల్లలకి దైవ దీవెనలు అందిస్తాయని నమ్ముతున్నాను'' అని చిరు ఎమోషనల్ అయ్యారు. మొత్తం మీద మెగా వారసుల పేర్లు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

### ఏడుగురు హీరోయిన్లతో

# భారీ అడ్వెంచర్ మూవీ



గమ్యంతో దర్శకుడిగా పరిచయం అయిన క్రిష్ జాగర్లమూడి మొదటి సినిమాతోనే మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. ఆ తర్వాత ఆయన దర్శకత్వంలో రూపొందిన చాలా చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. క్రిష్ కమర్షియల్ సబ్జెక్ట్స్ జోలికి పోకుండా వైవిధ్యమైన మూవీలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వెళ్ళాడు. దాంతో ఆయనకంటూ టాలీవుడ్ ఇండస్ట్రీలో ఒక ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది. కెరియర్ ప్రారంభంలో మంచి దర్శకుడిగా క్రేజ్ ను సంపాదించుకున్న ఈయన ఈ మధ్యకాలంలో మాత్రం ప్రేక్షకులను పెద్ద ఎత్తున నిరుత్సాహపరుస్తూ వస్తున్నాడు. చాలా కాలం క్రితం ఈయన దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ హీరోగా హరిహర వీరమల్లు స్టార్ట్ అయింది. కానీ అనేక కారణాలవల్ల ఈ సినిమా ఆలస్యమైంది. దాంతో ఈ చిత్ర దర్శకత్వ బాధ్యతల నుండి ఈ దర్శకుడు తప్పుకున్నాడు. కొంత కాలం క్రితం క్రిష్ 'ఘాటి' సినిమాకు దర్శకత్వం వహించాడు. మంచి అంచనాల నడుమ విడుదల అయిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. గత కొన్ని రోజులుగా క్రిష్ నెక్స్ట్ మూవీకి సంబంధించి ఓ వార్త వైరల్ గా మారింది. ఈ దర్శకుడు ఏడుగురు టాప్ హీరోయిన్లతో భారీ బడ్జెట్ తో ట్రెక్కింగ్ అడ్వెంచర్ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నట్లు, ప్రస్తుతం ఆ స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నట్లు ఓ వార్త వైరల్ అయింది. తాజాగా ఈ వార్తపై క్రిష్ స్పందించాడు... "ఏడుగురు హీరోయిన్లతో భారీ బడ్జెట్ తో ట్రెక్కింగ్ అడ్వెంచర్ మూవీ ఐడియా సూపర్ గా ఉంది. కానీ ప్రస్తుతం నేను అలాంటి కథపై పని చేయడం లేదు. ఇవన్నీ కేవలం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న పుకార్లు మాత్రమే. నేను ఏదైనా సినిమాకి కమిట్ అయితే దానికి సంబంధించిన అధికారిక ప్రకటనను స్వయంగా నేనే విడుదల చేస్తాను" అని క్రిష్ తాజాగా తెలియజేశాడు.

# నాపై చాలా విమర్శలు వచ్చాయి..
# చాలా కష్టంగా అనిపించింది: ఐశ్వర్య రజినీకాంత్



కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ కుమార్తె ఐశ్వర్య రజినీకాంత్, దర్శకురాలిగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. నిత్యం పలు బ్లాక్ బస్టర్ హిట్స్ అందిస్తూ ... సినీ ప్రియులను అలరిస్తోంది. ఇటీవల ఆమె తెరకెక్కించిన 'విత్ లవ్' థియేటర్స్‌లోకి వచ్చి సినీ సెలబ్రిటీలు ప్రశంసలు పొందింది. ఇదిలా ఉంటే.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్య, తాను సినిమా ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో ఎదుర్కొన్న సవాళ్లు, తన తండ్రి రజినీకాంత్‌తో ఉన్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. 2014లో రజినీకాంత్ హీరోగా ఐశ్వర్య దర్శకత్వంలో 'కొచ్చాడయాన్' అనే యానిమేషన్ సినిమా వచ్చింది. ఆ సినిమా గురించి ఐశ్వర్య మాట్లాడుతూ.. ''ఆ సినిమా విడుదలయ్యాక నాపై చాలా విమర్శలు వచ్చాయి. అప్పట్లో మన దేశంలో యానిమేషన్ (మోషన్ క్యాప్చర్) సాంకేతికత గురించి జనాలకు పెద్దగా అవగాహన లేదు. అందుకే ఆ సినిమాను బొమ్మల సినిమా అని వెక్కిరించారు.

**10 ఏళ్ల క్రితమే వినూత్న ప్రయత్నం చేశా..**

అందులో ఉన్నది రజినీకాంత్ కాదని కొందరు విమర్శించడం నన్ను చాలా బాధించింది. కొత్త విషయాలను ప్రయత్నించినప్పుడు జనం వెంటనే ఆదరించకపోవడం కష్టంగా అనిపించింది'' అని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం వస్తున్న సినిమాల గురించి చెబుతూ.. ''అప్పట్లో నేను ఏదైతే ప్రయత్నించానో, ఇప్పుడు అవే టెక్నిక్స్‌ను పెద్ద పెద్ద సినిమాల్లో వాడుతున్నారు. ఇప్పుడు వస్తున్న 'మహా అవతార్ నరసింహ' వంటి యానిమేషన్ చిత్రాలు పెద్ద హిట్లు కావడం చూస్తుంటే సంతోషంగా ఉంది. నేను 10 ఏళ్ల క్రితమే ఇలాంటి వినూత్న ప్రయత్నం చేశాను'' అని చెప్పింది. ఇక తన తండ్రి గురించి చెబుతూ ఐశ్వర్య ఎమోషనల్ అయింది. ''మా నాన్న నేను పుట్టకముందే సూపర్ స్టార్. అప్పట్లో ఆయన ఒకేసారి నాలుగైదు సినిమాలు చేస్తూ చాలా బిజీగా ఉండేవారు. దానివల్ల చిన్నతనంలో మేము నాన్నను చాలా మిస్ అయ్యాము. ఆయనతో సమయం గడపడం కోసం మేము షూటింగ్ స్పాట్‌లకు వెళ్లేవాళ్లం. ఆయన నటించిన సినిమాలన్నీ థియేటర్ల కంటే ముందు డబ్బింగ్ స్టూడియోల్లోనే చూసేవాళ్లం'' అని తన చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకుంది.

# ఫాలోవర్స్ కోసం
# సినిమాను బలి చేస్తున్నారు: కృష్ణవంశీ



సినిమా రిలీజ్ అయిన నిమిషాల్లోనే సోషల్ మీడియాలో వచ్చే నెగటివ్ రివ్యూల పై కృష్ణవంశీ ఓ రేంజ్‌లో విరుచుకుపడ్డారు. అలా చేసే 90% మందిని ఆయన 'మూర్ఖులు' అంటూ షాకింగ్ కామెంట్స్ చేశారు. ''చాలా మంది రివ్యూలు రాసే వాళ్లు టికెట్ కూడా కొనకుండా ఫ్రీగా సినిమాలు చూస్తున్నారు. కానీ, అదే సినిమా ఇండస్ట్రీ మీద బతుకుతూ సినిమాను చంపేయాలని చూడటం ఎంతవరకు న్యాయం?" అని ఆయన ప్రశ్నించారు. కనీసం ఒక వారం రోజుల పాటు రివ్యూలు ఇవ్వకుండా ఆగితే, అసలైన ప్రేక్షకులు సినిమాను చూసి జడ్జ్ చేస్తారు కదా అని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో రివ్యూలు రాసి, ఆ తర్వాత దర్శకులుగా మారిన వారిని ఉద్దేశిస్తూ.. ''చాలా మంది రివ్యూలు రాసేవాళ్లు సినిమాలు తీసి అట్టర్ ఫ్లాప్ అయ్యారు. కనీసం ఒక్క సరైన స్క్రీన్ ప్లే కూడా వాళ్లు రాయలేక పోయారు. ఇతరుల పనిని విమర్శించడం సులభం, కానీ ఒక సినిమా తీయడం వెనుక ఉన్న కష్టం వాళ్లకు తెలియదు'' అని అన్నారు. కొంతమంది కేవలం ఫాలోవర్స్ కోసం సినిమాను బలి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'నేనింతే' సినిమాలోని డైలాగ్స్‌తో కౌంటర్ ఇస్తూ.. ''సినిమా అనేది వేల కుటుంబాలకు అన్నం పెడుతుంది. అలాంటి సినిమాను నాశనం చేస్తూ మీరు అన్నం ఎలా తింటున్నారు? తినేటప్పుడు కనీసం మీకు సిగ్గు అనిపించడం లేదా?'' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక సినిమాపై నెగటివిటీని వ్యాప్తి చేసే ముందు ఆ సినిమా వెనుక ఉన్న వందల మంది కష్టాన్ని గుర్తించాలని ఆయన హెచ్చరించారు. కృష్ణవంశీ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

# బికినీలో తడి అందాలతో రెచ్చిపోయిన శ్రియ శరన్



సాధారణంగా హీరోయిన్లు కొందరు పెళ్లి అయిన తర్వాత పూర్తిగా ఇండస్ట్రీకి దూరం అవుతుంటారు. మరికొందరైతే పెళ్లి అయి, పిల్లలు పుట్టిన తర్వాత సినిమాలకు గుడ్ బై చెప్పి కుటుంబానికే పరిమితం అవుతారు. కానీ, శ్రియ శరణ్ విషయంలో ఇది పూర్తిగా ఉల్టా అని చెప్పాలి. పెళ్లై, ఒక పాపకు జన్మనిచ్చినప్పటికీ, శ్రియ తన గ్లామర్‌ను ఇసుమంతైనా తగ్గనీయకుండా వరుస సినిమాలతో దూసుకుపోతోంది. 40 ఏళ్లు దాటినా, ఇప్పటి యంగ్ హీరోయిన్లకు గట్టి పోటీ ఇస్తూ ఫుల్ ఫామ్‌లో ఉంది. గత ఏడాది శ్రియ నటించిన 'రెట్రో' సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను మెప్పించలేకపోయినా, ఆమె మాత్రం నిరాశ చెందకుండా వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుంటోంది.

**బికినీలో గ్లామర్ షో..**

ఒక పక్క కెరీర్‌ను బ్యాలెన్స్ చేస్తూనే, మరోపక్క తన వ్యక్తిగత జీవితానికి కూడా అంతే ప్రాధాన్యత ఇస్తుంది. ఎంత బిజీగా ఉన్నా తన భర్త ఆండ్రీ కోస్చీవ్, కూతురు రాధాతో కలిసి వెకేషన్లకు వెళ్లడం శ్రియకు అలవాటు. నేడు వాలెంటైన్స్ డే సందర్భంగా.. శ్రియ తన కుటుంబంతో కలిసి మాల్దీవులకు వెకేషన్‌కు వెళ్లింది. అక్కడ ఆమె చేసిన రచ్చ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. సముద్రపు ఒడ్డున బికినీ ధరించి శ్రియ చేసిన గ్లామర్ షో నెటిజన్లకు పిచ్చెక్కిస్తోంది. బీచ్ ఇసుకలో పడుకుని ఆమె ఇచ్చిన బోల్డ్ పోజులు చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. 44 ఏళ్ల వయసులో కూడా ఇంత పర్ఫెక్ట్ బాడీ షేప్ ఎలా మెయింటైన్ చేస్తోందని అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ ఫొటోలు చూసిన నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. "వయసు పెరుగుతున్నా నీ అందం మాత్రం తగ్గడం లేదు.. అమ్మవైనా సరే.. నీ అందం మత్తెక్కించేలా ఉందని కామెంట్లు చేస్తున్నారు.

రిపోర్టర్లు కావలెను

V3 NEWS
ప్రజా "విశ్వంభర"
తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్,
మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com